# రెండు అంతర్లోకాలు

విశాఖపట్నం. విశాలమైన భవనం. ఉదయం పది గంటలు. ఇంటిముందు చల్లని పూలకుండీలు. చల్లనిపూల కుండీల మధ్య తిరుగుడు కుర్చీలో భూమేంద్రచౌదరి. కొడుకులు ఫ్యాక్టరీకి వెళ్ళిపోయారు. పిల్లలు స్కూళ్లకి వెళ్ళిపోయారు. భార్యా కోడళ్ళూ పనివాళ్ళ చేత పనులు చేయిస్తున్నారు. ఆర్నెల్ల నుండి వార్తాపత్రికలు పేరుకుపోయాయి. అమ్మేయాలని భూమేంద్రచౌదరి రమేష్‌ని పిల్చాడు.

'ఎలాగ?....'

'తెలుగు పావలా... వింగ్లీషు ముప్పై అయిదు...'

కాదని చౌదరి తల అడ్డంగా తిప్పాడు.

'ఎలగిస్తరేటి?...'

'ముప్పైఅయిదూ... నలభై అయిదూ...'

'ముప్పై... నలభై... పెద్దోరు, మీతో బేరవేటి?...'

'తీసుకో... తీసుకో...'

'సిన్న పేపర్లు పనికిరావు... తోసిపక్కనెడతా,... తలకాయలన్నీ పేరుస్తా.. మీ ముంగలే సేత్తా... తలకాలయలునెక్కిట్టి డబ్బులిస్తా..'

చౌదరి మాట్లాడలేదు. తల కదిపేడు. రమేష్ మెట్ల కిందనున్న పేపరు కట్టలు తెస్తున్నాడు.

'సూసినావా! ఈ బాబు ఒవులు?! కోట్లు కోట్లు వున్నోడు! పనికిరాని పేపర్ల కాడకూడా బేరవాడుతున్నాడు. పైసా కూడా ఒగ్గనేదు! రమేష్‌గోడు పేదోడు! నోరుసించుకుంతా వింటింటికీ తిరుగుతున్నోడు... కాళ్ళు అరిగిపోయే ఈధిఈధికీ తిరుగుతున్నోడు... ఈడికి అయిదుపైసలొగ్గెపోతే వెలగబతుకుతాడు?... ఆ కనికారం ఈ బాబుకి నేదు! కాణీయే కావాల కానీ కనికరవక్కర్నేదు!...' అని అనుకుంటూ రమేష్ పత్రికల తలకాయలు వేరుచేస్తున్నాడు.

తిరుగుడు కుర్చీలో కూర్చొని చౌదరి సముద్రం వైపు చూస్తున్నాడు.

'రమేష్! నువ్వు నావైపు నాలోకి కసిగా కోపంగా చూస్తున్నావు! అయిదు పైసలు కూడా ఒగ్గిలేదని అలా చూస్తున్నావు! అంతేకదా! నేనెవణ్ణి?! సముద్రం! సముద్రం ఏం చేస్తుంది?! నదులొచ్చి తనలో కలుస్తాయని వానచినుకుల్ని ఒగ్గేస్తుందా?! నది ఎలా అయింది? ప్రవాహం ఎలా అయింది? సముద్రం ఎలా అయింది? వానచినుకుల్తోనే కదా! నేనూ అంతే? పైసలని ఒగ్గేస్తే, కోట్లు కోట్లు ఎలా కూడుతుంది?! చెమట చినుకుల్ని కొల్లగొడితే కానీ కోట్లు కోట్లు కూడదు కదా?!..." అని చౌదరి మనసులో అనుకుంటూ రమేష్‌లోకి చూస్తున్నాడు. రమేష్ చిన్న చిన్న పేపర్లన్నీ ఒకచోట పడేస్తున్నాడు. పత్రికల తలకాయలు ఒకచోట పేరుస్తున్నాడు.

'... ఈ బాబేటి వలగసూత్తన్నాదు? దొంగసూపులు దొంగలే సూత్తారనుకున్నా! ఈ బాబు కూడా దొంగసూపు సూత్తన్నాదు! నేను సేత్తున్న దొంగపని పసిగట్టేసినాడంటే, టపటప నాగించేస్తాడో ఏటో!? నానెంత దగా సేయగల్ను? అయిదు రూపాయలు సేయగల్ను! పదిరూపాయలు సేయగల్ను! వంతే! ఈ బాబైతే కోట్లు కోట్లే! సిన్నోడు సేత్తే దగావంటారు. మోసమంటారు... నేరవంటారు... ఈ బాబులు సేత్తే, ఏపారవంతారు... అభివృద్ధివంతారు! గాజుల రమేష్‌గోడు ఒవుడు?... సిత్తుకాగితాలూ, పాతపేపర్లూ కొనడం... కవర్లు సేయడం... సావుకోర్లకి వమ్మడం... పదేళ్ళ కాణ్ణుంచీవిదే పని! ఇప్పుడీ పని కూడా పడిపోనాది. పోల్తీను కవర్లు ఒచ్చేసి నాక ఇక ఇయ్యి ఒవుళ్ళు కొంతన్నారు!? సిదిగిపోయిన సచ్చు సావుకార్లే కొంతన్నారు... ఈ బాబు ముసిలోడే కానీ ముసిలోణ్ణా లేనేలేడు! వెలగున్నాడంటే... ఏతంతే... రగతం కోసం కూడు దినకుండ రగతవే తాగేస్తున్నట్టున్నాడు! వెంత డబ్బు! వెంత పవరు! వెంత పలుకుబడి!' అలా అనుకుంటూ రమేష్ తలకాయలు పేరుస్తున్నాడు. చౌదరి చూస్తూ చూడనట్టు రమేష్‌లోకి చూస్తున్నాడు.

'... రమేష్ చిన్న దగా చేస్తున్నాడు. నేను పెద్ద దగా చేస్తున్నాను. ఎవరి శక్తి మేరకు వాళ్ళు దగాలు చేస్తున్నారు. దోపిడీలు చేస్తున్నారు. దోపిడీ వ్యవస్థ అంటే అదే! సముద్రం ఏం చేస్తోంది? తనచుట్టూ వున్న భూవిని తనలో కలిపేసుకోవడానికి నిరంతరం అనుక్షణం పోరాడుతోంది! నేను పోరాడ్డం లేదు కానీ శాంతియుతంగా శాంతియుత మార్గంలో ఆ పనే చేస్తున్నాను! ఆకలికీ – అప్పుల బాధకీ – తట్టుకోలేని వాడు ఏం చేస్తాడు? ముందుగా ఆత్మహత్య చేసుకోడు!

ఉన్న బూవినీ ఆస్తినీ అమ్మేసుగుంటాడు! ఆ మార్గంలో శాంతియుతంగా కొంతబూవిని సేకరించేను... ఆకలితో ఉన్న వాడికి ఆకలిబాధే కానీ బూవి విలువా, ఆస్తి విలువా, తెలీవు కాబట్టి ఎంతోకొంత పారేసి కొంత బూవిని సేకరించేను... కాగితాలు సులువుగా కాలిపోతాయి గాబట్టి మా సోదర ఉద్యోగవర్గ సహకారంతో తగలబెట్టించేసి శాంతియుతంగా కొంత బూవిని సేకరించేను - కాదు కాదు - ఆక్రమించేను... కాగితాలు ఎవరు ఏం రాసినా అడ్డుకోకుండా ఒప్పుగుంటాయి కాబట్టి శాంతియుతంగా వారి సహకారంతో కొత్త రికార్డులు సృష్టింపజేసి కొంత సేకరించాను - కాదు కాదు - ఆక్రమించేను... వారూ బాగుపడ్డారు. నేనూ బాగుపడ్డాను... అందుకే మనం బాగుపడేలా చేసే రాజ్యాన్నే మనం అధికారంలో వుంచుతాం! మనవే రాజ్యాధికారంలా వుంటాం! వుంటున్నాం! మేం చేస్తున్న వ్యాపారం – దోపిడీ – అంతా ప్రజల అభివృద్ధే అనీ పాలకవర్గాలూ ఉద్యోగవర్గాలూ ప్రచారం చేస్తూ వారు కూడా అభివృద్ధి చెందుతూ వుంటారు! ప్రజలను నమ్మిస్తూ వుంటారు!... రమేష్‌గాడు కూడా ఎంత దగా చేస్తున్నాడో!...' అని చౌదరి సంతోషంగా మనసులో అనుకుంటూ సంతోషంగా రమేష్‌లోకి చూస్తున్నాడు. రమేష్ చౌదరి మొహంలోకి చూసీ చూడనట్లు చూస్తున్నాడు.

'నేను సేత్తున్న దగా ఈ బాబు పసిగట్టేసినాడంటే టపటప నాగించేస్తాడో ఏటో!... సొక్కా పట్టుకు నాగి సింపేస్తాడో ఏటో!... మరో సొక్కా కూడా నేదు. తెలుగు పేపర్లు సరిదీసినాను. మరింక వింగ్లీషు పేపర్లు తగుల్కొని సకసకలాడించేయాల...' అని రమేష్ మనసులో అనుకుంటూ ఇంగ్లీషు పేపర్లు వేరుచేస్తున్నాడు.

'... ఒరేయ్! రమేష్! దోపిడీ అందరూ చేస్తారనీ చేస్తున్నారనీ ఇప్పుడు చాలా స్పష్టంగా తెలుస్తోంది.... ప్రపంచంలో ఎన్నో సత్యాలున్నాయంటారు. అవేవీ నేను నమ్మలేకపోతున్నాను... రెండే రెండు సత్యాలను నమ్ముతున్నాను. ఒకటి పెట్టుబడి – రెండోది శ్రమ. అయితే సామ్రాజ్యవాద సహోదరులు లేదా సోదరులు ఎన్నో ఏళ్ళనుంచి ఒకే ఒకమాట చెప్తున్నారు. రెండు సత్యాల్లోనూ ఒకే ఒక సత్యం నిలబడాలనీ రెండో సత్యాన్ని ప్రపంచం నుండి పారిపోయేలా పోరాడాలని చెప్తూ పోరాడుతున్నారు... 'పెట్టుబడి' అనే సత్యం మాత్రమే నిలబడాలంటున్నారు... దోపిడీయే వ్యాపారమంటున్నారు. అది సహజమైందనీ, వ్యాపారంలో, అభివృద్ధిలో భాగమేననీ అంటున్నారు. దోపిడీ కాకుండా అభివృద్ధి కాదంటున్నారు. వారి మాటలను మేమందరం గౌరవిస్తున్నాం.. ఆచరిస్తున్నాం... వారు చూపిన మార్గంలో,

సత్యంలో, మేమందరం బాగా బాగుపడుతున్నాం కాబట్టి, అదే సత్యాన్ని మేమందరం గాఢంగా ప్రేమిస్తూ, ఆచరిస్తూ, అభివృద్ధి చెందుతున్నాం... రెండే రెండు సత్యాలున్నాయని ఇంతవరకూ నమ్ముతున్న మేం ఒకే ఒక సత్యం వుండాలని విశ్వప్రయత్నం చేస్తున్నాం... ఒరేయ్ రమేష్! నువ్వు చేస్తున్న దగా చూస్తున్నప్పుడు ఇదంతా అనుకోకుండా నా మనసులోకి వచ్చేసింది. కాబట్టి మనసులోనే అనుకుంటున్నాను...' అని చౌదరి రమేష్‌తో చెప్పలేదు కానీ మనసులో అనుకున్నాడు.

'అయిపోయిందా?'

'అవును బాబూ! జేబీలోని నెక్కల మిషను తీసి నెక్కేయండి...'

'ఎన్ని తలకాయలొచ్చాయ్?'

'తెలుగు నాలుగొందల ఏపై... వింగ్లీషు నాలుగొందల అరవై మూడూ...'

'తప్పు! తెలుగు అయిదువందల యాభై! ఇంగ్లీషువి కూడా అంతే!'

'తలకాయలు మీముంగలే వున్నాయ్... నెక్కెట్టుకోండి...'

'చిన్న పేపర్లు తీసిబయటపడేసావ్... మద్ది మద్దిన రెండు మూడు తలకాయలు జతచేసి ఒకే ఒక తలకాయగా చేసేసావ్... అందుకే చిన్నవి తీసివేసి, పెద్దవి జతచేసి మామూలుగా కనిపించేలా చేసేసావ్.. అందుకే తక్కువొస్తున్నాయ్..'

"ఒక్కసిటాం! ఒంటేలోసుకొచ్చి మళ్ళీ మీ ముంగలే నెక్కెడతా!... నాను ఎనిమిదోక్లాసు మూడేళ్ళు సదివినా... తప్పు నెక్కెట్ను...' అని రమేష్ గేటుదాటి బయటకు వెళ్ళేడు.

చౌదరి గుండ్రని కుర్చీలో గుండ్రంగా తిరుగుతూ రమేష్ కోసం ఎదురు చూస్తున్నాడు. కొంతసేపు చూసి గేటు దగ్గరకు వెళ్ళి చూశాడు. రమేష్ కనిపించలేదు.

చౌదరి పకపక నవ్వుకుంటూ గేటు దగ్గర చాలాసేపు నిలబడ్డాడు.

★ ★ ★

(ఆదివారం ప్రజాశక్తి - 07.12.2003)